క్లుప్తంగా

పేదల కోసమే 'ఆరోగ్య సురక్ష'

నందికొట్కూరు: పేదలకు ఉచిత వైద్యం అందించేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం తెచ్చారని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ముబారక్ ఫంక్షన్ హాల్‌లో 8వ సచివాలయం పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

వెలుగోడు: మార్చి 3న నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేల్పనూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జహీర్‌వలి పిలుపునిచ్చారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం పల్స్ పోలియో బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలో 8 పల్స్ పోలియో బూతులు ఏర్పాటు చేసినట్లు మెడికల్ ఆఫీసర్ చెప్పారు.

5 నుంచి శింగవరంలో ప్రతిష్ఠోత్సవాలు

మహానంది: బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామంలో మార్చి 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు శ్రీ విఘ్నేశ్వర, ఈశ్వర, వెంకటేశ్వర, ఆంజనేయస్వామి, నాగ, ధ్వజ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా సేద్యపు ఎద్దుల విభాగం (ఉమ్మడి జిల్లాలు)లో బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు.

ఉరుసును ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

పాములపాడు: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో నిర్వహించే మస్తాన్‌వలి ఉరుసు వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ నాగభూషణ్ అన్నారు. బుధవారం దర్గా ప్రాంతాన్ని పరిశీలించారు. ముజావర్ బాధ్యర్లతో మాట్లాడారు. ఏయే ప్రాంతాల నుంచి భక్తులు వస్తారని, ఎంత మంది రావొచ్చు అని ఆరా తీశారు. జనం రద్దీ ఉన్న ప్రాంతాల్లో జేబు దొంగలు వచ్చే అవకాశం ఉందని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 29న గంధం, మార్చి 1న ఉరుసు వేడుకలు నిర్వహించబడునని, ఉమ్మడి కర్నూలుతో పాటు కడప, చిత్తూరు, తెలంగాణ రాష్ట్రం నుంచి భక్తులు వస్తారని ముజావర్ తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ అశోక్, సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ లబ్ధి



శివపురం సచివాలయం వద్ద లబ్ధిదారులతో అధికారులు, ప్రజా ప్రతినిధులు

పాములపాడు: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూర్చిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని ఆ పార్టీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చెలిమిల్ల గ్రామంలో సర్పంచు కోట్ల చంద్రారెడ్డి అధ్యక్షతన జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాలు మంజూరైన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, ఎంపీటీసీ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయసింహారెడ్డి, మధుసూదన్‌రావు, తుమ్మలూరు సర్పంచు వరప్రసాదరావు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

కొత్తపల్లి: మండల కేంద్రమైన కొత్తపల్లి, శివపురం గ్రామంలోని గ్రామ సచివాలయాల వద్ద జగనన్న ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు బుధవారం ఎంపీడీఓ జవహర్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఎంపీటీసీ పెరుమాళ్ల శివన్న, కో– ఆప్షన్ మెంబర్ షేక్. మహమ్మద్ గౌస్‌తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'రైతు భరోసా'

ఆత్మకూరు: మండలంలోఅర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా నిధులు మంజూరు అయ్యాయని ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు భరోసా కేంద్రం చైర్మన్ బైరాపురం మహబూబ్‌బాషా తెలిపారు. బుధవారం పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో రైతు భరోసా– పీఎం కిసాన్, వైఎస్ పంటల బీమా పథకాల ప్రారంభ కార్యాక్రమాన్ని టీవీల్లో తిలకించారు. నాయకులు మునీర్‌బాష, టైగర్ బాబు, రఫీక్, అలీ పాల్గొన్నారు.

6,367 మందికి లబ్ధి

వెలుగోడు: 6,367 మంది రైతుల బ్యాంకు ఖాతాలోకి వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ మూడో విడతలో భాగంగా రూ.1.66 కోట్ల నగదు జమ అయినట్లు ఏవో పవన్ కుమార్ తెలిపారు. బుధవారం సీఎం వైఎస్ జగన్ రైతుల ఖాతాలోకి వైయస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ 5వ సంవత్సరం మూడవ విడత, సున్నా వడ్డీ పంట రుణాలు నగదును విడుదల చేశారు. కార్యక్రమాన్ని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో వీక్షించేలా ఆర్‌బీకేల్లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది రామకష్ణ, నాగమణి, వెంకట శివ, రైతులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లాలో 7,695 మందికి..

జూపాడుబంగ్లా: మండలంలోని 11గ్రామ సచివాలయాల పరిధిలో 7,695 మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ నిధులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. ఐదోవిడత మూడో ఇన్‌స్టాల్‌మెంట్‌లో భాగంగా 7,470మంది సొంత భూమి కలిగిన రైతులకు రూ.రూ.1.49కోట్లు, 225మంది కౌలు రైతులకు రూ.0.055 కోట్ల నిధులు విడుదల చేశారన్నారు.



నూతన అంగన్ వాడీ భవనం



గ్రామంలో వేసిన సీసీ రహదారి



నాడు–నేడు కింద అభివృద్ధి చేసిన పాఠశాల

నాగలూటి.. సుస్థిర అభివృద్ధి

- గ్రామంలో దాదాపు రూ. 2.50 కోట్లతో అభివృద్ధి పనులు
- సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్ నిర్మాణం
- నాడు–నేడు కింద పాఠశాల అభివృద్ధి
- నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



ఒకేచోట నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, ఆరోగ్య ఉపకేంద్రం

ఇది కదా.. అభివృద్ధి

మిడుతూరు: మండల పరిధిలోని గనులఖిల్లా నాగలూటి గ్రామం అభివృద్ధి పథంలో దుసుకెళ్తోంది. గతంలో ఫ్యాక్షన్ గ్రామంగా పేరొందిన గ్రామం నేడు జగనన్న పాలనలో సుస్థిర అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో గ్రామ సర్పంచ్ తమిడెల ఉషారాణి ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధికి బాటలు వేశారు.

గ్రామంలో చేట్టిన అభివృద్ధి పనులు ..

గ్రామంలో వివిధ నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల మొత్తం రూ. 2 కోట్ల 49 లక్షల 38 వేల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రూ. 43.50 లక్షల వ్యయంతో గ్రామ సచివాలయం, రూ. 23.94 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రం, రూ. 20. 94 లక్షల వ్యయంతో ఆరోగ్య ఉపకేంద్రం, రూ. 11.50 లక్షలతో అంగన్ వాడి కేంద్రం, రూ. 12.05 లక్షలతో నాడు–నేడు కింద పాఠశాలలో మరమ్మతులు, రూ.63 లక్షలతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సీసీ రహదారులు, రూ. 6 లక్షలతో గ్రామ పంచాయతీ నిధుల కింద సీసీ రహదారులు నిర్మించారు. రూ.12.5 లక్షలతో జలజీవన్ మిషన్ కింద పైపులైను, రూ.5 లక్షలతో జగనన్న కాలనీలో పైపులైను పనులు, రూ. 11.5 లక్షలతో జగనన్న కాలనీలో జలజీవన్ మిషన్ కింద (ఇంటింటికీ కుళాయి) పైపులైన్ పనులు, రూ.10 లక్షలతో గడప గడప నిధులతో వడ్డెపేటలో సీసీ రహదారులు, రూ. 15 లక్షలతో ఎంపీ నిధుల కింద పొలాలకు వెళ్లే గ్రావెల్ రహదారుల పనులు, రూ.5 లక్షలతో ఎంపీ నిధుల కింద మినరల్ వాటర్ ప్లాంటు, రూ. 5 లక్షల ఎంపీపీ నిధుల కింద పైపులైన్ పనులు, రూ.4 లక్షలు ఎంపీపీ నిధులతో సచివాలయ ముఖద్వారం, ప్రహరీగోడ తదితర పనులను చేపట్టారు.

నేడు పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఏపీ శాప్ చైర్మన్

గ్రామంలో పూర్తిచేసిన పలు అభివృద్ధి పనులను ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రారంభించనున్నట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తమిడెల సర్వేశ్వరరెడ్డి , పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు తమిడెల నాగతులసిరెడ్డి తెలిపారు.

గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి



నాగలూటి గ్రామంలో మునుపెన్నడూ లేనివిధంగా జగనన్న పాలనలో అభివృద్ధికి నోచుకోవడం హర్షనీయం. సీసీ రహదారులు, పైపులైప్ ఏర్పాటు, గట్టు మీద వెలసిన జగనన్న కాలనీ, ఇంటింటికీ కుళాయి, సచివాలయ భవనం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ ఒకే చోట నిర్మాణం చేపట్టడంతో ఆ గట్టు ప్రాంతం చూడముచ్చటగా ఉంది.

–ఎల్లారెడ్డి, నాగలూటి గ్రామం

చిరస్థాయిగా నిలిచిపోయేలా పనులు



గ్రామంలో ప్రజల సౌకర్యార్థం చిరస్థాయిగా నిలిచిపోయేలా అభివృద్ధి పనులు చేపట్టాం. ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. సర్పంచ్‌గా నా హయాంలో అభివృద్ధి పనులు చేపట్టడం చెప్పలేనంత ఆనందాన్ని ఇచ్చింది.

– సర్పంచ్ తమిడెల ఉషారాణి, నాగలూటి గ్రామం

నాటుసారా స్థావరాలపై దాడులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కోళ్ల బావాపురం గ్రామం సమీపంలో నాటుసారా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు. దాడుల్లో 500లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 30 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఎవరైనా నాటుసారా అక్రమ రవాణా చేసిన, అమ్మినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వలస వెళ్లకుండా పనులు

కొత్తపల్లి: మండలంలోని ఏ గ్రామం నుంచి కూడా ప్రజలు వలస వెళ్లకుండా పనులు కల్పిస్తున్నామని ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏపీఓ రేష్మ ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ముందుగా ఏ గ్రామాలలో పనులు కల్పిస్తున్నారు, ఎంతమంది కూలీలు పనులకు హాజరు అవుతున్నారు అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు వెయ్యి మంది జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పొందుతున్నారన్నారు.

మహిళలపై కేసు నమోదు

పగిడ్యాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో పనిచేసే వంట నిర్వాహకురాలు నాగమ్మపై దాడికి పాల్పడిన ముగ్గురు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ బుధవారం తెలిపారు. నాగమ్మతో పాటు పుష్పావతి, ప్రభావతి, రాణెమ్మలు ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులుగా పని చేస్తున్నారు. అయితే డబ్బులు స్వాహా చేసిందనే నెపంలో మంగళవారం నిందితులు ముగ్గురు నాగమ్మపై దాడి చేయగా స్వల్ప గాయపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

మార్కెట్ వేలాలు వాయిదా

నందికొట్కూరు: 2024–25 సంవత్సరానికి సంబంధించిన మార్కెట్ వేలం పాటలు అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ బుధవారం తెలిపారు. వారపు సంత, దిన కూరగాయల మార్కెట్, బస్టాండ్ ఫీజులు, జంతు వధశాల, మాంసపు మార్కెట్ సంబంధించి వేలం పాటలు మార్చి 1వ తేదీన ఉదయం 11 గంటలకు జైకిసాన్ పార్కులో నిర్వహిస్తామన్నారు.



ఏబీఎం పాలెంలో జైభీమ్ పార్కును ప్రారంభిస్తున్న కోట్ల హర్ష, సిద్ధార్థరెడ్డి

మళ్లీ వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

- ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి
- ఏబీఎం పాలెంలో జైభీమ్ పార్కు ప్రారంభం

నందికొట్కూరు: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఏబీఎం పాలెంలో సాయంత్రం జైభీమ్ పార్కు ప్రారంభించారు. ఈ సందర్భంగా కోట్ల హర్ష, సిద్ధార్థ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్‌లకు ఏబీఎం పాలెం ప్రజలు ఘన స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాలను ఎలా అభివృద్ధి చేయాలో సీఎం వైఎస్ జగనన్నకే తెలుసన్నారు. పట్టణాన్ని సుమారు రూ.50 కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎస్సీలకు ఉచితంగా విద్యుత్ అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందని స్పష్టం చేశారు. 40 ఏళ్ల ఇండస్ట్రీస్ అన్ని గొప్ప చెప్పుకునే చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా దోపిడీ చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రశాంతి, కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు చిన్నరాజు, నాయబ్, చాంద్‌బాషా, మంగలి కృష్ణ, రవూఫ్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, మండల అధ్యక్షులు రవియాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్‌బేగ్, అబుబక్కర్, రామకృష్ణ, స్వాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం కల్యాణమస్తు, షాదీతోఫా



వెఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా చెక్కు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: ప్రభుత్వం అందిస్తున్న కల్యాణమస్తు, షాదీతోఫా పేద కుటుంబాలకు వరమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో 61 మందికి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద ఆడపడుచుల వివాహాలకు ఆర్థిక సహాయం అందజేయడం గర్వించదగ్గ విషయమన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఈ పథకం ఎంతో అండగా నిలుస్తుందని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం కల్యాణమస్తు ఇస్తామని చెప్పి మోసం చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ జోనల్ ఇన్‌చార్జ్ అబుబక్కర్, కౌన్సిలర్లు హమీద్, చాంద్‌బాషా, రవూఫ్, అశోక్, లాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు రజనీకుమార్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, కుర్వ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం

మహానంది: అన్నిశాఖల అధికారుల సమన్వయంతో మహానందిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని, భక్తుల మన్ననలు పొందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని నంద్యాల రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి కోరారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలోని పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ భవనంలో ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. హోటళ్లు, దుకాణదారులు భక్తులకు నాణ్యమైన తినుబండారాలు అందివ్వాలని, ఇష్టమొచ్చినట్లు ధరలు వసూలు చేస్తే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని 8, 9, 10వ తేదీల్లో మద్యం దుకాణాలు మూసివేయించాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు.

ప్రతి భక్తుడికి మహాలింగోద్భవం దర్శనం

మహానందికి వచ్చే ప్రతి భక్తుడికి మహాశివరాత్రి రోజున మహాలింగోద్భవ కాలంలో మహానందీశ్వర స్వామి దర్శనం కల్పిస్తామని ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమాల్లో నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంఏహెచ్‌ఓ డాక్టర్ అంకిరెడ్డి, సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు భారీ బందోబస్తు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి, మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్‌లతో కలిసి మహానందిలోని పార్కింగ్ ప్రదేశాలు, ఆలయ పరిసరాలను పరిశీలించారు. అలాగే లాడ్జీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి, అధిక అద్దెలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అల్లర్లకు పాల్పడితే కటకటాలే

మహానంది: ఎన్నికల సమయంలో ఎవరైనా గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠినచర్యలు ఉంటాయని బండిఆత్మకూరు ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. బండిఆత్మకూరు మండలం ఈర్నపాడులో బుధవారం రాత్రి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల వేళ గ్రామాల్లో నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా అపరిచితులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పొద్దని ప్రజలకు హితవు పలికారు.

- వైఎస్సార్‌సీపీలో భారీ చేరికలు
- ప్రతిపక్ష పార్టీకి ఎదురు గాలి
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వచ్చే ఎన్నికల్లో విజయం మనదే



ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన శ్రీపతిరావు పేట టీడీపీ నాయకులు

ఆత్మకూరు: వచ్చే ఎన్నికల్లో విజయం మనదే. ప్రతిపక్ష పార్టీ టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపడం అసాధ్యమని ఎథిక్స్ కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నో హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా సరిగా నెరవేర్చలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి నోటికి ఏది వస్తే అలా దుర్భాషలాడటం సరికాదని, అలాంటి నాయకులకు ఓటు ద్వారా ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి 98శాతం హామీలు నెరవేర్చారని, వలంటీర్ వ్యవస్థ, ప్రజా సంక్షేమ పథకాలు అందాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

షాదీఖానా ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయండి

పట్టణంలోని నూతన షాదీఖానా ప్రారంభోత్సవాన్ని మార్చి 3వ తేదీన చేపడుతున్నామని, ఈ కార్యక్రమాన్ని ముస్లిం మైనార్టీ నాయకులు, హిందూ సోదరులు కలిసి మెలిసి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శిల్పా అన్నారు. పట్టణంలో ముస్లింల కోసం తన సొంత ఖర్చులతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన రూ.2కోట్లతో నిర్మించిన షాదీఖానాను ప్రారంభిస్తున్నామని చెప్పారు. శ్రీశైలం నియోజకవర్గం పరిశీలకుడు హబీబుల్లా మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి శ్రీశైలం నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, షాదీఖానా ప్రారంభించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీ చేరికలు

మండలంలోని శ్రీపతిరావు పేటకు చెందిన టీడీపీ నాయకులు రాజేష్, మణి, షేక్షావలి, కృష్ణయ్య, రాజు, కిరణ్, సుందరయ్య, పెద్దదానమయ్య, అబీ, రంగన్న, నాగరాజు, రమణయ్య, అర్జున్‌లతో పాటు 50 మంది కుటుంబ సభ్యులు స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

టైలర్లు అభివృద్ధి చెందాలి

టైలర్లు తాము నమ్ముకున్న టైలరింగ్ వృత్తి ద్వారా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని డైమాండ్ ఫంక్షన్ హాల్ నందు బుధవారం టైలర్స్ డే నిర్వహించారు. అంతకు మునుపు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డిని టైలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, విజయచౌదరి, సుల్తాన్, హబీబుల్లా, శేఖర్, ఖదీర్, జాకీర్‌హుసేన్, సయ్యద్‌మీర్, లాలు, నూర్‌మహమ్మద్ పాల్గొన్నారు.

టైలర్ల సంక్షేమానికి కృషి చేయాలి

జూపాడుబంగ్లా: టైలర్ల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని నియోజకవర్గ టైలర్ల సంఘం అధ్యక్షుడు జయరాం కోరారు. బుధవారం మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో టైలర్ల దినోత్సవ వేడుకలను సీనియర్ టైలర్ నజీర్ అధ్యక్షతన నిర్వహించారు. కుట్టుమిషన్ రూపకర్త మిలియంహో చిత్రపటానికి ఏఎస్ఐ మేరీజయంతి, టైలర్లు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన టైలర్ మహబూబ్‌బాషా, భగవాన్‌దాసులకు సంతాపంగా మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృపాకర్, ఎర్రన్న, ఎస్ఎండీ సలాం, చిన్నతిరుపాలు, ఖాసీం, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపల్లి బ్రాంచ్ మేనేజర్ కేవీ పవన్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని శివపురం, కొత్తపల్లి, వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని కళాజాత బృందాలతో నిర్వహించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ భగవాన్, సీఎస్పీ రమాదేవి పాల్గొన్నారు.

పరీక్షలపై భయం వీడాలి

ఆత్మకూరు: 10వ తరగతి విద్యార్థులు భయం వీడి పరీక్షలకు హాజరుకావాలని, పబ్లిక్ పరీక్షలంటే ఆందోళన చెందవద్దని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి దినేష్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాస పరీక్షలు నిర్వహించారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రేమ్ కుమార్, గంగాధర్, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోండి

పాములపాడు: తాగునీటి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఈ మనోహర్ అన్నారు. బుధవారం మండలంలోని మిట్టకందాల గ్రామాన్ని సందర్శించారు. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా కొక్కెరంచ వాటర్ స్కీం నుంచి నీటి సరఫరా పెంచాలని ఆదేశించారు. నూతన పంపు సెట్ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వర రెడ్డి నీటి ట్యాంకర్ ను గ్రామానికి పంపించారు.

కొనసాగిన ప్రతిష్ఠ మహోత్సవాలు

మిడుతూరు: శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ నూతన ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం కూడా కొనసాగాయి. ప్రాతఃకాల పూజనం, యంత్రాలకు రుద్రాభిషేకం, ధ్వజశిఖర దేవతలకు సుగంధద్రవ్యముల చేత మహస్నానము(అభిషేకం) తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజస్తంభం, శిఖరానికి ఏర్పాటుచేసే కలశాలు ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో గ్రామోత్సవం నిర్వహించారు.

ఆర్యవైశ్యులకు రాయితీపై యంత్రాలు

వెలుగోడు: మండల పరిధిలోని ఆర్యవైశ్యులకు ఉపాధి కోసం కుట్టుమిషన్లు, గ్రైండర్లు, చిన్న పాటి యంత్రాలు రాయితీపై ఇవ్వడం జరుగుతుందని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బచ్చురాము తెలిపారు. యంత్రాలు కావాల్సిన వారు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుల వారికి తమ దరఖాస్తు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో బల్లాని వెంకటసత్యనారాయణ, లాలం నాగార్జున, సంజీవరావు ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సైన్స్ ప్రదర్శనల్లో ప్రతిభ చాటారు. నందికొట్కూరు మండల పరిధిలోని వడ్డెమాను జెడ్పీ హైస్కూల్‌లో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాములపాడు మండలంలోని వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. మిడుతూరు మండలపరిధిలోని కలమందలపాడు జెడ్పీ పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయం, మిడుతూరు జెడ్పీ పాఠశాలలో జాతీయ సైన్స్‌డే వేడుకలు నిర్వహించారు. వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ భారతీయ శాస్త్రవేత్త సి.వి రామన్ జీవిత విశేషాలపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం, సైన్స్ ప్రయోగాల ప్రదర్శన నిర్వహించి విజేతలకు మెరిట్ సర్టిఫికెట్స్, బహుమతులు బహూకరించారు. సున్నిపెంట డిగ్రీ కళాశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని నిర్వహించారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

పాములపాడు: మండల కేంద్రంలోని ఇంటర్ పరీక్ష కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సీఐ నాగభూషణ్ సందర్శించారు. ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లుతో మాట్లాడారు. బయటి వ్యక్తుల నుంచి ఎలాంటి సమస్యలున్న వెంటనే పోలీసు వారికి ఫిర్యాదు చేయాలని సూచించారు.